
# ఆ(కలి)వేదన

**కృష్ణనివేదిత**



కరకరలాడుతోంది పొద్దు.

చరచరా సాగుతున్నాడు సూర్యుడు. కరకరలాడుతున్న పొద్దులో ఎండ వేడిలో మట్టి పెళ్ళగిస్తున్నాడు సత్యం. కాసేపు గునపంతో మట్టి పెళ్ళగించి, పారతో తట్టకెత్తి బండిలో పోస్తున్నాడు.

అలసిన శరీరం. ఆవురావురంటున్న ప్రేగులు

కరకరలాడుతున్న పొద్దు.

సత్యం పొద్దువంక చూస్తూ. మాటి మాటికి వూళ్ళోనుండి పొలంవైపు వచ్చే పుంత రహదారి వైపు చూస్తున్నాడు.

బారెడు పొద్దెక్కెనా చద్ది రాలేదు.

"చద్ది ముంత రాదేమో"

అయినా ఎక్కడో ఆశ తళుక్కుమంటుంది.

ఆ ఎండలో మట్టి గునపంతో పెకలిస్తుంటే వళ్ళంతా చెమట పట్టి నీరసం వస్తోంది. అయినా పళ్ళబిగువునా గునపం ఎత్తుతూనే ఉన్నాడు. రాత్రి అన్నం తినలేదేమో నరాలన్ని నిస్సత్తువుగా అనిపిస్తున్నాయి.

రాత్రి బియ్యం లేక వంట చెయ్యలేదు. రాత్రొక్క రోజేనా... ఎన్నో రాత్రులు వట్టి గంజినీళ్ళు... లేకుంటే నూకల జావ... అదీ లేకుంటే మంచి నీళ్ళే మంచి ఆహారం. గంజినీళ్ళో, నూకల జావో, మంచినీళ్ళో తాగి ఆకలితో అల్లాడుతున్న ప్రేగుల్ని అల్లరిచే యొద్దని జోకొట్టే తమలాంటి కుటుంబాలెన్నో...

రాత్రి కొడుకు శివ ఆకలేసి అన్నం కోసం ఏడుస్తుంటే పదేళ్ళ వాడి ఆకలి తీర్చలేనని ఆక్రోసించిన ఆ తల్లి ఎంత మూగబాధను అనుభవించిందో... అలా తన భార్య అన్నపూర్ణ ఒక్కతేనా...

"ఓ దేవుడా యీ పరిస్థితి ఏ తల్లికి రానియకు తండ్రీ" అని పదే పదే అనుకుంటూ కన్నీళ్ళు పెట్టుకుంటున్న తల్లులెందరో... కన్నవాళ్ళ ఆకలి తీర్చలేని తనలాంటి తండ్రుల అసహాయత...

తనెంత అసమర్థుడు కాకపోతే కట్టుకున్న దానికి, కన్నవాళ్ళకి చివరికి జన్మనిచ్చిన తల్లికి కూడా పట్టెడన్నం పెట్టలేని అసహాయ స్థితిలో ఉన్నాడు.

"తల్లికి కడుపు నిండా అన్నం పెట్టలేని కొడుకు కూడా ఒక కొడుకేనా..." పదే పదే అనుకుంటూ మట్టిని పారతో తీసి తట్టలో పోస్తున్నాడు.

నడిమింటి కొచ్చాడు సూర్యుడు. తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. పని ఆపి, చెరువులో కాళ్ళు, చేతులు ముఖం కడుక్కుని వచ్చి కొద్దిసేపు చెట్టు మొదలుకు చేరగిల్లాడు.

ఆకలి... నిసత్తువ... నీరసం...

సత్యం ఆ వూళ్ళో ఒకప్పుడు ఆరెకరాలుగల రైతుబిడ్డ. కష్టించి పనిచేస్తు మట్టినే నమ్ముకున్నవాడు. అయితే సకాలంలో లేని వర్షాలు, భార్య అనారోగ్యం, పిల్ల పెళ్ళికోసం చేసిన అప్పులు దెబ్బమీద దెబ్బ తగులుతునే వుంది. దాంతో ఆరెకరాలలో అయిదెకరాలు తనఖాలో వుంది.

మూడేళ్ళుగా కరవురక్కసి విలయ తాండవం చేస్తుంది. భార్య అనారోగ్యం కోసం ఒక ఎకరం. పిల్ల పెళ్ళికోసం ఒక ఎకరం. పిల్ల కట్నంగా ఒక ఎకరం. యింటి ఖర్చులకి, వడ్డీల క్రింద ఒక ఎకరం తానఖాలో ఉంది. వానదేవుడు కరుణించటం లేదు. వరద గోదారి కరుణించటం లేదు. ఈ తనఖాలో ఉన్న భూమికి ఎప్పుడు విముక్తి అవుతుందో. వున్న ఎకరానికి తోడుగా తన భూమినే మరో ఎకరం తనఖా పెట్టినతనినుండే కౌలుకు తీసుకున్నాడు.

సత్యానికి ముగ్గురు మగ పిల్లలు. ఒక ఆడపిల్ల. పెద్దకొడుకు చంద్రాన్ని పెద్దగా చదివించాలని అప్పైనా సరే అని చదివించాడు. బి.ఏ. ఫస్టుక్లాసులో పాసు అయ్యాడు. యింకా రకరకాల పరీక్షలకి వెళ్ళేవాడు. ఇంటర్వ్యూలకి హాజరయ్యేవాడు. ఖర్చులకి ఎంతో సొమ్ము కావల్సి వచ్చేది. వాడి శ్రద్ధను చూసి అప్పు అన్న భయం లేకపోయింది. ఉద్యోగంకోసం కాళ్ళరిగేలా తిరిగాడు. వారి ఆశ ఫలించలేదు. కన్నవాళ్ళకు భారమయ్యానని వాడే అనుకున్నాడో- వాడి ఆయుస్సు దారాన్ని భగవంతుడే తెంపాడో మొత్తం మీద రైలు క్రింద పడి చచ్చిపోయాడు.

వాడెంత పిచ్చివాడు.

కళ్ళు మూసుకుపోతున్నాయి నెమ్మదిగా.

"నాన్నా" చిన్నకొడుకు కృష్ణ కంఠం.

"ఊ" భారంగా కళ్ళు విప్పాడు.

"లే- అన్నం తిందువుగాని" ఉట్టిలో వున్న ముంత గిన్ని తీసాడు. నూకల జావ వుంది అందులో.

మౌనంగా చూస్తున్నాడు కొడుకు వంక సత్యం 'తిను నాన్నా' తండ్రి కళ్ళల్లో నీళ్ళు చూచి ఉలిక్కిపడ్డాడు కృష్ణ.

"ఏమైంది నాన్నా" అతని కంఠంలో ఆందోళన.

మాట్లాడలేదు సత్యం.

"తిను నాన్నా" చెయ్యి పట్టుకున్నాడు.

"శివ" సత్యం మాట్లాడలేకపోయాడు.

తండ్రి ఆవేదనను అర్థం చేసుకున్నాడు "వాడు తిన్నాడు నాన్నా"

తండ్రి నెమ్మదిగా జావ తాగుతుంటే కృష్ణ నిశ్శబ్దంగా చూస్తున్నాడు.

ఎంత చక్కగా అబద్ధమాడేడు తను. శివ అన్నంకోసం ఏడుస్తుంటే తల్లి వేడి గంజిలో కాసింత బెల్లం కలిపి యిచ్చింది. అదే వాడికి పాయసం అని చెప్పి మభ్యపెట్టి తను తాగించాడు. తల్లి, తనూ కూడా టీ డికాక్షన్‌తోనే సరిపెట్టుకుంటున్నారు.

చివరికి నానమ్మ కూడా పల్చటి గంజే త్రాగింది. చివరికి నానమ్మ కూడా ఏమంది "బిడ్డడు పొద్దున్న బోయేడు. రెక్కలు ముక్కలు చేసుకుంటున్నాడు. వాడికి పంపు ఆ జావ నేనీ గింజి నీళ్ళు తాగుంటాను" అది కన్నకడుపు ఆవేదన.

పంటలేవు. కూలి దొరకటం లేదు. ఏం చెయ్యాలో తెలియదు. ఏదో కొద్దిగా చదువుకున్న తనలాంటి వారికోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు చేపట్టిందన్నారు. అదీ ప్రయత్నించాడు. అవి అధికారుల లంచగొండితనం ముసుగులో వున్నాయని తెలిసింది. పథకాల పేరుల్లోనే తేడాలు గాని అవినీతి మార్గాల్లో కాదని గ్రహింపుకొచ్చింది. అవన్నీ కన్నీళ్ళ తుడుపు అని తెలియటాన్కి ఎంతోకాలం పట్టలేదు. ప్రభుత్వ పథకాలు పథకాలుగానే మిగిలిపోతున్నాయి. ఐదేళ్ళకొకసారి వస్తారు నేతలు. ఏదో చెబుతారు. యివి చేస్తాం. అవి చేస్తాం అంటారు. యింకా ఫలానావి చేస్తాం అంటారు. కాని...

ఏవి ఎక్కడ కార్యరూపం దాల్చని వారి మాటలు. ఈ మారుమూల పల్లెలో...

కనీసం... యిక్కడ బ్రతికే మనుషులకు కనీసవసరాలకి సరిపడ నీళ్ళు కొరతని. ఆ కొరతని తీర్చాలన్న ఆలోచన రాదు వాళ్ళకి. పదవీ వ్యామోహం తప్ప.

అర్జీల ఛార్జీలు దండుగ.

పెరిగిపోతున్న ధరలు... మురిగిపోతున్న అప్పులు..

మూగబోతున్న బ్రతుకులు చిరుగుల బొంతలు.

దేశానికి వెన్నుముకలైన రైతుల బ్రతుకులు భారమౌతున్నాయి.

ఎందుకిలా జరుగుతుంది.

రైతు దున్నితేనే రాజులకన్నం.

కాని రైతుకేది అన్నం... మన్నుని నమ్ముకున్న రైతుకి అన్నం ఏది...!

"ఏమిట్రా" తండ్రి గొంతు విని ఆలోచనలు తెగిపోయాయి.

"ఏం లేదు నాన్నా. నేను మట్టి పెళ్ళగిస్తాను. నువ్విక్కడ కాసేపు కళ్ళు మూసుకో."

"వద్దురా నువ్వింటికిపోయి శెట్టిని బ్రతిమాలి ఎలాగోలా బియ్యం పోయించు. ఈ రాత్రికి రాయుడుగారింటికిపోయి గడ్డికోసిన కూలి యిమ్మంటాను" ఉట్టిలో ముంత గిన్నిపెట్టి యిచ్చాడు.

మాట్లాడకుండా వెనుదిరిగిన కొడుకును చూచి నిట్టూర్చాడు సత్యం. అన్న మరణం చూచిన కృష్ణ చదువు ఆగిపోయింది. కాదు ఆపేసాడు. కూడు పెట్టని చదువులకై యీ అప్పులెందుకు, ఆ పరుగులెందుకు అంటూ పట్నంలో పేపరువేసి, స్కూల్ పిల్లలకి క్యారేజీలు మోసి తనూ సంసార రథాన్ని లాక్కురావటానికి సాయం చేస్తున్నాడు.

తిండికి యింట గింజలుంటే యింత ఇబ్బంది లేకపోను. కరువురక్కసి నట్టింట తాండవమాడుతుంది.

* * *

సాయంత్రం రాయుడుగారింటికి వెళ్ళాడు సత్యం. గేటు దాటుతుండగానే ఎదురొచ్చాడు రాయుడుగారి మనుమడు.

"బాబూ తాతగారున్నారా."

"ఏమో" విసురుగా వెళ్ళిపోయాడు అతడు. కృష్ణ వయస్సే వుంటుంది. దబ్బపండులా మిసమిసలాడుతున్నాడు.

వీధి అరుగుమీద కూర్చున్నాడు ఉసూరంటూ. కొద్దిసేపటికి యింట్లో పని చేసే మా లక్ష్మీ వచ్చింది.

"రాయుడుగారు గాని, అబ్బాయిగారు గాని వున్నారా"

"రాయుడుగారు లేరు. అబ్బాయిగారు వున్నారు."

"సత్యం కూలి డబ్బులకొచ్చాడని చెప్పు తల్లీ".

"అలాగే" అంటూ అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చింది.

సత్యం కళ్ళు ఆశగా చూచాయి.

"రేపు రమ్మన్నారు"అని గబగబా లోపలికి వెళ్ళిపోయింది.

నిసత్తువుగా యింటివైపు నడక సాగించాడు సత్యం.

"కూలి డబ్బులియ్యలేదా" భార్య ప్రశ్నకు మాట్లాడలేదు సత్యం.

అదే సమాధానమని తెలిసిన అన్నపూర్ణ అతన్ని మరి మాట్లాడించకుండా వెళ్ళిపోయింది.

ఆ పూట ఆ యింట పొయ్యి రాజదు. అది తెలిసిన పెద్దవాళ్ళు మౌనంగా ఉండిపోయారు. కాని... పసివాడు శివ...

అందరిలోనూ ఆవేదనే... వ్యక్తం చెయ్యలేని బాధ. ఎవరికివారే అసమర్థులమన్న తలంపే.

శెట్టిని ఎంత బ్రతిమాలినా బియ్యం పొయ్యనన్నాడు. పాత బాకీ తీరిస్తే గాని ససేమిరా అరువు పెట్టనన్నాడు. అప్పు తేవాలంటే యిప్పటికీ చేబదుళ్ళు చాలా అయ్యాయి. ఇంచుమించుగా తమ వీధిలో అందరి పరిస్థితి అలాగే ఉంది. వాళ్ళనెలా అడగాలి. అయినా శివ కోసం అభిమానం పక్కనబెట్టి అడిగింది అన్నపూర్ణమ్మ. మా పరిస్థితి అలాగే వుంది వదినా" అంటూ పొయ్యి చూపించింది. ప్రక్కింటి నారాయమ్మ పొయ్యి శుభ్రంగా తుడిచి వుంది. యింక ఎవర్ని అడగలేకపోయింది. అందరి స్థితి దొడ్లో కొట్ట పొయ్యిలో పెట్ట అన్నట్లుంది.

"అమ్మా ఆకలేస్తుంది అన్నం పెట్టు" ఆడి ఆడి వచ్చాడు శివ.

వాడు అన్నం అడిగితే ఏం చెప్పాలో... ఎలా చెప్పాలో అర్థం కాలేదా తల్లికి.

"అమ్మా అన్నం" తల్లిని కుదుపుతూ అడిగాడు శివ.

"వంట చెయ్యలేదు నాన్నా" చెప్పలేక చెప్పిందామె.

"ఎందుకు చెయ్యలేదు. రాత్రి చెయ్యలేదు. పొద్దున్న తినలేదు.. గబాలున అన్నపూర్ణమ్మ వాడి నోరుమూసి వంటింట్లోకి లాక్కెళ్ళింది.

మంచంమీద పడుకున్న సత్యం ఉలిక్కిపడ్డాడు. పొద్దున్న శివ జావ కూడా తాగలేదా?

"నా బాబువి కదూ రేపు నాన్న డబ్బులు తేగానే నీకు పెరుగన్నం పెడతాను. ఈ పూటకి ఈ జావ తాగి పడుకో నాన్నా" బ్రతిమాలుతుంది నెమ్మదిగా వాడిని.

"ఊహు... నాకిప్పుడే అన్నం కావాలి" క్రింద పడి దొర్లుతూ ఏడుపు ప్రారంభించాడు వాడు.

ఒక్క నిముషం ఏమీ పాలుపోలేదు. తల్లి బ్రతిమాలుతున్న కొద్ది వాడి ఏడుపు ఎక్కువైంది.

అన్నపూర్ణమ్మలో సహనం అంతరించిందేమో "వెధవా... చెబుతుంటే నీక్కాదు" అంటూ మూలనున్న కర్ర దీసి వీపుమీద రెండు దెబ్బలు వేసింది. సమయానికి కృష్ణ వచ్చి అడ్డుకోకపోతే ఆవిడింకా చిన్న కొడుకుని కొట్టేసేదే.

"అమ్మా ఏమిటిది" తమ్ముడ్ని తల్లి చేతులనుండి తప్పిస్తూ అడిగాడు.

హఠాత్తుగా చేతులలో ముఖం దాచుకుని కూలబడి పోయిందామె.

కృష్ణ తమ్ముడ్ని తీసుకుని వెళ్ళిపోయాడు నాన్నమ్మ దగ్గరికి. తమ్ముడ్ని మంచంపై పడుకోబెట్టి వాతలు తేలినచోటల్లా కొబ్బరినూనె రాసాడు. వాడికి నెమ్మదిగా చెబుతూ "యిదిగో నీకోసం ఏం తెచ్చానో చూడు" అంటూ గుప్పెడు విప్పాడు.

అన్న చేతిలో చాక్లెట్లు చూడగానే శివ ముఖం విప్పారింది. "ఈ చాక్లెట్లు నాకేనా?".

"నీకే నాన్న. యివి తింటూ ఉండు. అమ్మ అయిదు నిముషాలలో వంట చేసేస్తుంది" అని తమ్ముడి చేతిలో చాక్లెట్లుంచి వెళ్ళబోతుంటే "పాడు బ్రతుకులు కుర్రవెధవకి గుప్పెడు మెతుకులు పెట్టలేం" నాయనమ్మ కళ్ళు తుడుచుకుంటూ సణుకుంటూ నిట్టూర్చటం కృష్ణకి వినిపిస్తూనే వుంది. అతను శెట్టి కొట్టు వైపు సాగిపోయాడు.

శెట్టి కృష్ణని చూడగానే ఆముదం తాగినట్లు ముఖం పెట్టాడు. ముఖ కవళికలు గమనించినా గమనించనట్టే మూడువందల నోట్లు శెట్టికిచ్చి "యివి బాకీలో జమపెట్టుకుని నాల్గురోజుల సరిపడ బియ్యం. వెచ్చాలు యివ్వు" అన్నాడు.

"పొద్దున డబ్బు లేదన్నావ్ కదయ్యా. యిప్పుడెక్కడిది" చింకిచాట్టైంది శెట్టి వదనం.

ఎక్కడిదో కృష్ణ చెప్పలేదు. మౌనంగా బియ్యం, వెచ్చాలు తీసుకున్నాడు. యింటికి వచ్చేసరికి తండ్రి తల్లిని అడుగుతున్నాడు. "ఏం చేసాడు వాడు అట్లా కొట్టావ్."

చటుక్కున తలెత్తిన అన్నపూర్ణమ్మ భర్త అడిగిన ప్రశ్నకు సమాధానం గొంతు విప్పి చెప్పలేదు గాని కళ్ళు మాత్రం చెప్పాయి. కన్నబిడ్డకు పిడికెడన్నం పెట్టలేని తల్లిని అని.



**తండ్రికి ముంత యిచ్చి వచ్చాక శెట్టి దగ్గరికి పోతే వాడు పాతబాకీకోసం నానా మాటలన్నాడని గాని తరువాత తాను పట్నం వెళ్ళి తన రక్తం బ్లడ్ బాంక్‌లో అమ్మి తెచ్చానని గాని కృష్ణ చెప్పలేదు. యిలా ప్రతి రెండు, మూడు నెలల్లో ఎప్పుడో అప్పుడు జరుగుతున్నదని కూడా కృష్ణ చెప్పలేదు.**

"నేనే... నేనే చేతకాని వాడ్ని పూర్ణా. కట్టుకున్న వాళ్ళకు, కన్నవాళ్ళకు తిండి పెట్టలేని దౌర్భాగ్యు...డ్ని"

గభాలున భర్తనోటికి చెయ్యి అడ్డం పెట్టింది.

"అమ్మా బియ్యం, వెచ్చాలు తెచ్చాను. గమ్మున వంట కానీ" సంచీతో వచ్చిన కొడుకుని చూచి ఆశ్చర్యపోయిందా తల్లి.

"వెచ్చాలెవరిచ్చారు."

"ఎవరిస్తారు శెట్టి".

"పాత బాకీ తీర్చక యివ్వనన్నాడుగా."

"తీర్చేసాను. అంతా కాదులే కొంత".

"డబ్బులెక్కడివి"

"అవన్నీ తరువాత. ముందు వంట చెయ్యమ్మ. "తమ్ముడు నిద్రపోతాడు" హెచ్చరించినట్లుగా అన్నాడు గాని తల్లికి వివరాలేమీ చెప్పలేదు.

తండ్రికి ముంత యిచ్చి వచ్చాక శెట్టి దగ్గరికి పోతే వాడు పాతబాకీకోసం నానా మాటలన్నాడని గాని తరువాత తాను పట్నం వెళ్ళి తన రక్తం బ్లడ్ బాంక్‌లో అమ్మి తెచ్చానని గాని కృష్ణ చెప్పలేదు. యిలా ప్రతి రెండు, మూడు నెలల్లో ఎప్పుడో అప్పుడు జరుగుతున్నదని కూడా కృష్ణ చెప్పలేదు.

రాత్రి పక్కలు వేస్తుంటే నాయనమ్మ "ఒరేయ్ చిన్నోడా"అని పిల్చింది.

"ఏమిటి నాయనమ్మా"

"నిరాహారదీక్షంటే ఏమిట్రా ఏదైనా పూజా"

"దీక్ష అంటే అయ్యప్ప దీక్షో, భవానీ దీక్షో కాదు నాయినమ్మ. నిరాహారదీక్ష అంటే ఆహారం ఏమీ తీసుకోకుండా ఉండటం" నవ్వుతూ చెప్పాడు కృష్ణ.

"మరి దీక్షంటాడేమిట్రా" వీళ్ళ సంభాషణ వింటూ పుస్తకంలోనుంచి తలెత్తి ఆసక్తిగా చూస్తున్నాడు శివ అన్న ఏం చెబుతాడా! అని అన్న చాలా తెలివైనవాడని వాడికో నమ్మకం.

"దీక్షంటే..." ఒక్క క్షణం ఆగి "ప్రభుత్వం గాని, యజమానులుగాని తన సమంజసమైన కోర్కెలు ఆమోదించకపోతే పనిచేసే కార్మికులు సమ్మె ప్రకటిస్తూ పనులలోకి పోకుండా ఆయా ఆఫీసుల ముందు టెంట్లు వేసుకుని, బోర్డులు పట్టుకుని నినాదాలు చేస్తారు. వాళ్ళ కోర్కెలు యజమాన్లు పట్టించుకోక, సమ్మెను పట్టించుకోనప్పుడు వారిలో కొందరు నాయకులు ఏ ఆహారం తీసుకోకుండా నిరసన తెలుపుతారు. దాన్నే నిరాహారదీక్ష అంటారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంకోసం పొట్టి శ్రీరాములు చెయ్యలేదా...అలాంటిదే యిది కూడా"విడమర్చి చెప్పాడు కృష్ణ

"మరతను చాలారోజులు చేసాడు కదా"

"అవును."

"పొద్దున్న రాయుడుగారింటికాడ చెప్పుకుంటున్నారేమిటి. అతగాడి బావమర్ది కొడుకు పదిహేను గంటలు నిరాహారదీక్ష చేస్తానని ప్రకటించాడట. అతగాడు మంత్రేమిటి".

(మిగతా 11వ పేజీలో)

# దేవత

## జపాన్ కథలు

-- సౌభాగ్య --

ఆ కుర్రాడు బౌద్ధ భిక్షువు. బుద్ధుని పట్ల బుద్ధుని బోధనల పట్ల ఎంతో గౌరవం, భక్తి వున్నవాడు. ఆ కుర్రాడికి బుద్ధుడు జన్మించిన భారతదేశాన్ని, బుద్ధుని జన్మ స్థలాన్ని సందర్శించాలన్న కోరిక కలిగింది.

అది ఈ కాలం కాదు. పన్నెండో శతాబ్దం. ఆరోజుల్లో జపాన్ నించీ చైనా వెళ్ళాలంటేనే ఎంతో కష్టం. అట్లాంటిది జపాన్‌కు ఎంతో దూరం వున్న భారతదేశం వెళ్ళడం ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్న విషయం.



పెద్దలు అతని ప్రయత్నాన్ని వారిస్తూ "ఇప్పుడు బుద్ధుని బోధనలు అనుసరించే వాళ్ళు భారతదేశంలో లేరు. నువ్వు భారతదేశం వెళ్ళడం కష్టం. ఆ ప్రయత్నాల్లో వెళ్ళిన వాళ్ళు ఇప్పటిదాకా ఎవరూ తిరిగి రాలేదు" అన్నారు.

ఆ కుర్రాడి మేనత్త కూడా బుద్ధుని బోధనల పట్ల తీవ్రంగా ఆకర్షితురాలయింది. ఆమె ఒకసారి ఉపవాస వ్రతం ప్రారంభించింది. మూడురోజులు కనీసం నీళ్ళు కూడా తాగకుండా ధ్యానంలో నిమగ్నమయింది. ఐనా మరింత కాంతివంతంగా, ఆరోగ్యంగా కనిపించింది. తన మేనల్లుడికి బుద్ధుడి పట్ల వున్న భక్తివిశ్వాసాలకు ఆమె ఎంతో సంతోషించేది.

ఆమె ఒకరోజు తలుపులు మూసుకుని ధ్యానంలో కూచుంది. కాసేపటికి కళ్ళు తెరచి ఎదురుగా చుట్టి గోడకు ఆనించిన ఒక చాపను చూసింది. వెంటనే ఆ చుట్టిన ఆ చాప దానంతట అదే విడిపోయి పైకి లేచి గది మధ్య నిలబడింది. కళ్ళు మూసుకుని పద్మాసనంలో వున్న ఆమె గాలిలో లేచి కదిలి వెళ్ళి ఆ చాపపై అలాగే కూచుంది.

అప్పుడే తలుపు తెరిచిన ఆమె మేనల్లుడు ఆ దృశ్యం చూసి అద్భుతాన్ని చూసినట్లు ఆగిపోయాడు.

అతని రాకను గమనించిన ఆమె కళ్ళుతెరచి నేను దేవతను. నువ్వు భారతదేశాన్ని దర్శించాలన్న కోరిక మంచిదే కానీ అది చాలా కష్టంతో కూడుకున్న పని. స్థానికంగా 'నారా'లో వున్న నా ఆలయాన్ని దర్శించు. నేను మీ అత్తను ఆవహించి ఈ విషయం చెబుతున్నాను' అంది. ఆశ్చర్యపోయిన కుర్రాడు మెల్లగా నిష్క్రమించాడు.

మరుసటిరోజు ఆ గదిలోనుండి అద్భుతమయిన పరిమళం కిటికీల గుండా ప్రవాహంలా వచ్చి పరిసరాల్ని తన్మయంచేస్తూ వుంటే ఆ కుర్రాడు, ఇతర బంధువులు ఆ గది తలుపులు తెరిచి లోపలికి వెళ్ళారు.

ఇప్పుడు ఆ గదిలో చాప కిందనే వుంది. కానీ ఆమె ఇంటి కప్పుకి దగ్గరగా శూన్యంలో పద్మాసనంలో ధ్యాన మగ్నమయి వుంది. మనోహరమయిన పరిమళం, కళ్ళు జిగేలుమనిపించే కాంతి తరంగాలు ఆమె నుండీ వెలువడుతున్నాయి.

ఆమె అర్థ నిమీలిత నేత్రాలతో వుంది.

అందరూ తలలు వంచి నమస్కరించారు.

ఆమె కళ్ళు తెరచి 'నేను దేవతను. ఈ కుర్రాడి భక్తికి మెచ్చాను. 'నారా'లోని నా ఆలయాన్ని సందర్శించండి. మీకు సుభశాంతులిస్తాను. ఇప్పుడు నేను ఈ స్త్రీని వదిలి వెళుతున్నాను' అనగానే ఒక కాంతిరేఖ నీడలా కిటికీ నుండి సాగిపోయింది.

శూన్యంలో ఉన్న స్త్రీ ఒక హంస రెక్కలా నెమ్మదిగా భూమిపైన వాలింది. అప్పుడే నిద్ర లేచినట్లు తన చుట్టూ చేతులు జోడించిన వాళ్ళందర్నీ చూసి ఆశ్చర్యపోయింది! ★

**నేను దేవతను. నువ్వు భారతదేశాన్ని దర్శించాలన్న కోరిక మంచిదే కానీ అది చాలా కష్టంతో కూడుకున్న పని. స్థానికంగా 'నారా'లో వున్న నా ఆలయాన్ని దర్శించు. నేను మీ అత్తను ఆవహించి ఈ విషయం చెబుతున్నాను' అంది.**

(9వ పేజీ తరువాయి)

"ఇప్పుడు కాదు నాయనమ్మ ఒకప్పుడు."

"పదిహేను గంటలంటే..."

"ఉదయం 7, 8గంటలకి మొదలుపెట్టి రాత్రి 10గంటల వరకు ఏమీ తినకుండా ఉంటారు."

"ఓస్ యింతేనా. అన్ని గంటలకే మైకులతో జనాన్ని జోరెత్తించాలేమిటి ఆడపిల్లలు తద్ది, అట్లతద్ది చేస్తారిలా... అయినా ఎందుకేమిటి"

"ఈ ప్రభుత్వం రైతుల్ని ఆదుకోవటం లేదట..."

"ఇతగాడున్నప్పుడు ఏమి ఆదుకున్నాడేమిటి. ఇతడేమిటి ఎవరాదుకున్నారసలు. కష్టాలు కన్నీళ్ళు రైతులవి. కాసులు దళారీలని కోటివిద్యలు కొండ్రకు లోకువని సామెత కొండ్రదున్నే రైతే లోకువ. ఒక్కడొస్తాడు బోర్లు కొట్టామంటారు. ఇంకొకడొస్తాడు కరెంట్ కొరత అంటాడు. ఇంకోడు వరి వద్దంటాడు. మరోడు వాణిజ్య పంటంటాడు. ఎవడురా రైతునాదుకున్నాడు."

నాయనమ్మ మాటలలో సత్యముంది. వాస్తవిక పరిస్థితుల పట్ల ఆవేదనుంది. అనుభవం తాలుకు ఆవేశముంది. కాని దాన్ని అర్థం చేసుకోగల అవగాహనే ప్రజానాయకులకు లేనిది.

★ ★ ★

"అన్నయ్యా యిది చూడు" రామాలయం దగ్గర వేసే పేపరు తెస్తూ అన్నాడు శివ.

"ఏమిట్రా" నవ్వుతూ అడిగాడు తాడుపేనుతున్న సత్యం.

"ఇక్కడ చూడు" పెద్ద పెద్ద అక్షరాలు వున్నచోట చూపిస్తూ అన్నాడు శివ.

"మాజీ మంత్రి నిరాహారదీక్ష విరమణ" పెద్దగా చదివి ఏమిటన్నట్లు చూసాడు తమ్ముడివంక కృష్ణ.

"పదిహేను గంటలు ఏమీ తినకపోతేనే యితన్ని గురించి యిందులో పెద్ద పెద్ద అక్షరాల్లో వేసారు కదా! మరి మనం అన్నేసి రోజులు అన్నం లేకుండా మంచినీళ్ళు తాగి ఉంటుంటే ఒక్కసారంటే ఒక్కసారి చిన్ని చిన్ని అక్షరాలలోనైనా మన పేర్లు వెయ్యరేం అన్నయ్య పేపర్లో" చాలా అమాయకంగా అడుగుతున్నాడు శివ.

ఆదమరచి నిద్రపోతున్న అధికార రాజన్ని గురించి అమాయకంగా అడుగుతున్నాడు "ఆకలి" తెలిసిన శివ అన్నను ఏమని చెబుతాడతను. తమలాంటి ఆకలి రైతుల ఆవేదనను పేపరులో ఎంత చిన్న అక్షరాలలో వేసినా... ఎంతమంది రైతులు ఆకలి చావులు చచ్చినా... పథకాల కంటితుడుపులే తప్ప ఇంట్లో దరిద్ర దేవత తుడుపు ఏమీ ఉండదని...

ఈ ఆకలి మంటలు చాలా సర్వసాధారణమైనవని...తలచే ఆ ప్రజాప్రతినిధులు దుర్వినియోగపరిచే కోట్లాది రూపాయలలో ఒక వంతు కేటాయించినా ఈ ఆకలి మంటలు చల్లారతాయని... తమ తల్లిలాంటి ఎందరో తల్లుల కన్నీళ్ళు... తుడవటాన్కి నిరుపయోగమౌతున్న కొద్ది కోట్లు చాలని... ఎవరికి చెబుతాడు... తమ పొయ్యిలో పిల్లి లేవదని

ఎలా చెబుతాడు...? రక్తం అమ్మితే ఆహారం నోటికి వచ్చిందని. ఏమని చెబుతాడు....? తమలాంటి ఎందరో ఆకలి ఆవేదనను ఆ పసి మనసు అమాయకంగా అడుగుతున్న ఆ ప్రశ్నకు అతడేమి సమాధానం చెబుతాడు. అందరి ఆకలి తీర్చే రైతుబిడ్డల "ఈ ఆకలి ఆవేదన ఎవరికి నివేదిస్తాడు" ఎవరికి విన్నవిస్తాడు. ★